# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాయలసీమను రతనాలసీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- గడిచిన రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని, రానున్న మూడేళ్లలో కూడా పెంచబోమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.
- ప్రభుత్వ ఉపాధ్యాయులు బోధనపైనే శ్రద్ధ పెట్టాలని.. ఏవైనా సమస్యలుంటే “లీప్ యాప్” ద్వారా నేరుగా తనకే తెలియజేయాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు.
- ఉత్తర కోస్తాంధ్రలో రేపు అక్కడక్కడా తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

రాయలసీమను రతనాల సీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారాన్ని ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించి అనంతరం ప్లాంటు రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... చమురు తర్వాత విదేశీ మారక ద్రవ్యాన్ని ఎక్కువగా వినియోగించేది బంగారాన్ని కొనుగోలు చేయడానికేనని తెలిపారు. గోల్డ్ మైనింగ్‌తో జొన్నగిరిలో పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఇక్కడ ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి అవుతుందని.. ఇప్పటికి 400 కిలోల సామర్థ్యంతో ప్రారంభమైందని, భవిష్యత్‌లో వెయ్యి కిలోలకు చేరుతుందన్నారు. అదే విధంగా 800 ఉద్యోగాలు వచ్చాయని, త్వరలో 1,500 మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. గోల్డ్ మైన్ ప్రాజెక్ట్ రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఒక చోదక శక్తిగా మారుతుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

గడిచిన రెండేళ్లలో ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని, అదే క్రమంలో రైతులకు 9 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అదే విధంగా రానున్న మూడేళ్లలో విద్యుత్ ఛార్జీలను పెంచబోమని స్పష్టం చేశారు. ఆక్వా రైతులను కాపాడే భాద్యతను కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఆంధ్రప్రదేశ్ 19 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించిందని పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సంస్థలపై పెనుభారం మోపారని, ఇతర రాష్ట్రాల నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఆక్వా రైతులకు ఇప్పటివరకు 800 కోట్ల రూపాయల రాయితీ ఇచ్చామని, వెనుకబడిన వర్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. దేశంలో మొదటిసారి విద్యుత్ ఛార్జీలు ట్రూడౌన్ చేసిన ప్రభుత్వం తమదేనని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి రవికుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదులను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఈరోజు ప్రారంభించారు. 'పీ4' విధానంలో దాతల సహకారంతో సుమారు కోటీ 40 లక్షల రూపాయల వ్యయంతో కార్పొరేట్ స్థాయిలో ఈ ఆధునిక క్లాస్ రూమ్‌లను నిర్మించారు. భవనాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి లోకేశ్ విద్యార్థులతో ముచ్చటించి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రభుత్వ బడులను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్ది, రాబోయే రోజుల్లో 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు బోధనపైనే శ్రద్ధ పెట్టాలని, సమస్యలుంటే "లీప్ యాప్" ద్వారా నేరుగా తనకే తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులు ఎంఈఓ, డీఈఓల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వచ్చే నెల 16, 17, 18వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 'పేరెంట్-టీచర్ మీటింగ్' నిర్వహిస్తామని మంత్రి లోకేశ్ వెల్లడించారు.

==========================

విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఖైదీల పునరావాసం కోసం జైళ్ల శాఖ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఖైదీలు విడుదలైన తర్వాత ఉపాధి పొందేలా కార్పొరేట్ స్థాయి ఐటీ నైపుణ్యాలను అందిస్తున్నామని జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ సీ.హెచ్. సూర్యకుమార్ తెలిపారు. తొలి విడతగా 30 మంది ఖైదీలకు `ఆఫీస్ అసిస్టెంట్` కోర్సులో శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ రెండు నెలల కోర్సులో ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ అప్లికేషన్లు, డిజిటల్ కమ్యూనికేషన్, కార్యాలయ నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఖైదీలు సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని సూర్యకుమార్ ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

విరామం

==========================

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ భానుప్రకాష్ అన్నారు. ప్రకాశం జిల్లాలో జరుగుతున్న ఈ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి ఈ మధ్యాహ్నం సమీక్షించారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని ఎన్నికల అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ భానుప్రకాష్ మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియను ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా చేపట్టాలన్నారు. సమావేశం అనంతరం ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు విలేకరులతో మాట్లాడుతూ... ఎన్నికల విధుల్లో ఉన్న ఈఆర్ఓ, ఏఈఆర్ఓలతో మాట్లాడి ఎస్ఐఆర్ పురోగతి గురించి తెలుసుకున్నారని చెప్పారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ దాదాపు 80

శాతం పూర్తి అయిందన్నారు. డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని రేపు ప్రారంభిస్తామని, ఈ ప్రక్రియలో ఓటర్లు బీఎల్ఓలకు సహకరించాలని కలెక్టర్ కోరుతూ…

(వాయిస్ 25 సెకన్లు)

===========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

===========================

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించి పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఓ) దేవ సుధాలక్ష్మి అన్నారు. భీమవరంలో వైద్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలకు మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో ఈ ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై  అవగాహన సదస్సును జిల్లా వైద్య సిబ్బంది ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐఓ మాట్లాడుతూ… దేశంలో పోలియో నిర్మూలనైనప్పటికీ మన పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ లో పోలియో కేసులు నమోదవుతుండడం వల్ల మళ్లీ పోలియో చుక్కల కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు.

===========================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే మిగతా చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

===========================

బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు సొంతింటి మాదిరిగా సౌకర్యాలు కల్పిస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత తెలిపారు. రాష్ట్రంలో 998 బీసీ హాస్టళ్లు ఉన్నాయని, వాటిలో 85 వేల మంది విద్యార్థులు వసతి సౌకర్యం పొందుతున్నారని వెల్లడించారు.

===========================
===========================